క్లుప్తంగా

అన్న క్యాంటీన్లపై నిరంతర పరిశీలన తప్పనిసరి



పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లపై వీఎంసీ అధికారుల నిరంతర పరిశీలన తప్పనిసరిగా ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి శనివారం ఆయన అన్న క్యాంటీన్ల నోడల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 11 ప్రాంతాల్లో ఉన్న అన్న క్యాంటీన్లలో, తాగునీటి సరఫరా, వాడుక నీరు, కిచెన్‌లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, భోజనంలో నాణ్యతను నిరంతరం పరిశీలించాలన్నారు. ప్రతి రోజు సందర్శకులకు ఇస్తున్న టోకెన్ల వివరాలను నోడల్ ఆఫీసర్లు నిత్యం పరిశీలించాలని, ఆయా ప్రాంతాల్లోని క్యాంటీన్లలో ఏమైనా మరమతులు ఉన్న వెంటనే చేయించి ప్రజలకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేబీఎన్ కళాశాలకు ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్ర లయోలా కళాశాలలో ఇటీవల జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో అత్యధిక గోల్స్ చేసిన తమ కళాశాల జట్టు యూనివర్సిటీ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుందని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. ఈ విజయం సాధించడం ద్వారా తమ కళాశాల టీం సభ్యులు బి.ప్రేమ్‌తేజ, ఎం.లీలామనోహర్, పి.జాషువా, కె.దీపక్‌చందు, బి.దుర్గాప్రసాద్ త్వరలో కాలికట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పురుషుల ఫుట్‌బాల్ పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు. ప్రతిభచూపిన విద్యార్థులు, వ్యాయామ విభాగాధిపతి డీ హేమచంద్రరరావును ప్రిన్సిపాల్‌తోపాటు హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణ రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేంకటేశ్వర రావు అభినందించారు.

కుమార్తె కనిపించడం లేదంటూ ఫిర్యాదు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మతిస్థిమితం లేని తన కుమార్తె కనిపించటం లేదంటూ శనివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఓ తండ్రి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటేశ్వరనగర్‌కు చెందిన మిరియాల నాగమణి పెద్ద కుమార్తె రామలక్ష్మీదేవి(34)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం భోజనం చేసి నాగమణి బయట కూర్చున్నారు. కొద్దిసేపటికి తెలిసిన వారు వచ్చి మీ అమ్మాయి బీఆర్టీఎస్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుందని చెప్పారు. దీంతో నాగమణి హుటాహుటిన బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకుని కుమార్తె కోసం వెతికారు. చుట్టు పక్కల తెలిసిన వారు బంధువులు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలలో వెతికినప్పటికీ ఫలితం లేదు. దీంతో శనివారం నాగమణి గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రియేటివిటీ, వినూత్న ఆలోచనలు అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజువల్ కమ్యునికేషన్ రంగంలో రాణించాలంటే క్రియేటివిటీ, వినూత్నంగా ఆలోచించే విధంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.అనిత అన్నారు. నలంద డిగ్రీ కళాశాల విజువల్ కమ్యునికేషన్ విభాగం ఆధ్వర్యంలో శనివారం విజనరీ విస్తాన్ 2కే 24 సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న అనిత మాట్లాడుతూ.. విజువల్ కమ్యునికేషన్ కోర్సు చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి రంగంలోనూ డిజిటల్ మార్కెటింగ్ ఆవశ్యకత ఉందని, ఆ నిపుణుల కొరత అధికంగా ఉందని తెలిపారు. అనంతరం ఫొటోగ్రఫీ, క్విజ్, మోడలింగ్ వంటి అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, విజువల్ కమ్యునికేషన్ విభాగాధిపతి బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఫిరోజ్‌ఖాన్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో దత్త జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. దత్త జయంతిని పురస్కరించుకుని ఆలయంలోని దత్తాత్రేయ స్వామివారికి ఆలయ అర్చకులు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం దిగంబర శ్రీ పాదవల్లభ దిగంబర నామ సంకీర్తన జరిగింది. లోక కల్యాణార్థం దత్త హోమం వేద పండితుల మంత్రోచ్చారణలతో నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కలశ జ్యోతుల ఉత్సవం







ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు భవానీలు, భక్తులు శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో కలశజ్యోతులను సమర్పించారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఇంద్రకీలాద్రికి వరకు కలశ జ్యోతుల ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రిజర్వాయర్ వినియోగంలోకి వచ్చేదెన్నడో?

- ఇప్పటికే పనులు పూర్తి..
- అయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- ఇంకెంతకాలం ఎదురుచూడాలంటున్న ప్రజలు



ప్రారంభోత్సవానికి నోచుకోని నూతన మంచినీటి రిజర్వాయర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలకు సురక్షిత మంచినీరు అందించేందుకు నగరపాలక సంస్థ 40వ డివిజన్ పరిధిలోని లారీస్టాండ్‌లో నిర్మించిన మంచినీటి రిజర్వాయర్ కొద్దినెలలుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నికలకు కొద్దిరోజుల ముందు పనులు పూర్తికాగా, సంబంధిత అధికారులు ఇటీవల పలుమార్లు ట్రెల్‌రన్స్ వేశారు. కాని రిజర్వాయర్ మాత్రం ప్రారంభానికి నోచుకోకపోతుండటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. పశ్చిమనియోజకవర్గానికి విజిటింగ్ ప్రొఫెసర్ మాదిరిగా అప్పుడప్పుడు వచ్చే ఎమ్మెల్యే సుజనాచౌదరికి రిజర్వాయర్ ప్రారంభోత్సవ రిబ్బన్ కట్ చేసేందుకు సమయం ఉండటం లేదా? అంటూ స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

రూ.5.50కోట్లతో పనులు పూర్తి..

అప్పటి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో భవానీపురం లారీస్టాండ్‌లోని వాటర్‌ట్యాంక్ పక్కనే 1500 కెఎల్ సామర్థ్యంతో మరోట్యాంక్ నిర్మించేందుకు15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.3.30 కోట్లు మంజూరు అయ్యాయి. ప్రస్తుతం ఉన్న ట్యాంక్ నుంచి గాంధీబొమ్మరోడ్డు, చర్చి రోడ్డు, కోళ్లఫారంరోడ్డు, ఆకుల రాజేశ్వర రావు మిల్ రోడ్డు, స్వాతి రోడ్డు(కొంత భాగం), సభాపతి రోడ్డు, చైతన్య అపార్ట్‌మెంట్ రోడ్డు, బేతపూడి అరుణకుమారివీధి, ఆశ్రమం వీధి వరకు మంచినీరు సరఫరా అవుతోంది. ఇక కొత్తగా నిర్మించిన వాటర్‌ట్యాంక్ నుంచి జాతీయరహదారికి ఓవైపు ఉన్న బాలభాస్కరనగర్ నుంచి అల్లుడిపేట, భవానీ హాస్పటల్‌రోడ్, 41వ డివిజన్ పరిధిలో మసీదువీధి, ప్రెసిడెంట్ వీధి, రంగూన్‌సాహెబ్ వీధి, మీరాసాహెబ్ వీధి, దళితవాడ వరకు తాగునీటిని సరఫరా చేయనున్నారు. కొత్తగా నిర్మించిన వాటర్‌ట్యాంక్ నుంచి బాలభాస్కరనగర్ వైపు ఉన్న ఆయా ప్రాంతాలకు పైప్‌లైన్ వేసేందుకు మరో రూ.2.20 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో పైప్‌లైన్ల పనులు కూడా పూర్తిచేశారు.

విద్యుత్ సమస్య తలెత్తినా ఇబ్బంది లేకుండా..

విద్యాధరపురంలోని మున్సిపల్ హెడ్ వాటర్‌వర్క్సులో విద్యుత్ సమస్య తలెత్తినపుడు నగరంలోని మంచినీటి రిజర్వాయర్లకు నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అయితే అటువంటి సమస్య లేకుండా హెడ్ వాటర్‌వర్క్సు నుంచి లారీస్టాండ్‌లోని పాత వాటర్‌ట్యాంక్, కొత్తగా నిర్మించిన ట్యాంక్‌లను వేకువజామునే నీటిని నింపుకుంటే, ఆ తర్వాత విద్యుత్ సమస్య ఏర్పడినా ఆయా ట్యాంక్‌ల నుంచి మంచినీటి సరఫరాకు ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. పనులన్నీ పూర్తయినందున వెంటనే రిజర్వాయర్ ప్రారంభిస్తే తమకు మేలు కలుగుతుందని ఆయా డివిజన్ల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రిజర్వాయర్ గ్రౌండ్‌లో లెవెల్ పనులతోపాటు జంగిల్ క్లియరెన్స్ పనులు సాగుతున్నాయని, త్వరలోనే రిజర్వాయర్ ప్రారంభోత్సవం ఉంటుందని నగర పాలక సంస్థ నీటిసరఫరా విభాగం అధికారులు చెబుతున్నారు. అయితే అధికారులకు సైతం ఎమ్మెల్యే అపాయింట్‌మెంట్ లభించనందునే ప్రారంభోత్సవం జాప్యానికి ప్రధాన కారణమనే విమర్శలు రాజకీయవర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే హామీలు ప్రకటనలకే పరిమితం..

వెస్టను బెస్ట్‌గా మారుస్తానని ఎన్నికల ముందు ఆ తరువాత కూడా ప్రకటనలు చేసిన స్థానిక ఎమ్మెల్యే సుజనాచౌదరి, ప్రజలకు తాగునీటిని అందించే విషయంలో మాత్రం కనీస దయ లేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇకనైనా ఎమ్మెల్యే స్పందించి వెంటనే మంచినీటి రిజర్వాయర్‌ను ప్రారంభించి తమ మంచినీటి ఇక్కట్లు తొలగించాలని ఆయా డివిజన్ల ప్రజలు కోరుతున్నారు.

రెండు డివిజన్ల ప్రజలకు మేలు..

పశ్చిమ నియోజకవర్గం గట్టువెనుక ప్రాంతంలోని 40, 41 డివిజన్ల పరిధిలోగల నివాసాలకు ఇప్పటి వరకు భవానీపురం లారీ స్టాండ్‌లో 1500 కెఎల్ సామర్థం కలిగిన వాటర్ ట్యాంక్ నుంచి మంచినీటిని సరఫరా చేస్తున్నారు. వాటిల్లో 40వ డివిజన్‌కు పూర్తిగా, 41 డివిజన్‌లో కొంతభాగం మాత్రమే నీరు సరఫరా అవుతోంది. అయితే ఆయా డివిజన్లలో పెరుగుతున్న జనాభా అవసరాలకు మేర నీటిసరఫరా జరగకపోతుండటంతో 40వ డివిజన్‌లో మంచి నీటి కొరత తీవ్రంగా ఉంది. దీంతో స్థానికుల నుంచి వస్తున్న పిర్యాదులు, వినతుల నేపథ్యంలో మరోవాటర్ ట్యాంక్ నిర్మాణ ఆవశ్యకతపై స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్ల కిందట కౌన్సిల్‌లో ప్రతిపాదించగా, ఆమోదిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది.

కళాక్షేత్రంలో ఏర్పాట్ల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఆత్మ బలిదానం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గౌరవార్థం ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నారు. అందుకు కళాక్షేత్రంలో చేస్తున్న ఏర్పాట్లను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రెండో శనివారం సెలవు రోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న రమాదేవి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో దళిత బహుజన రీసెర్చ్ సెంటర్ (డీబీఆర్సీ) ఆధ్వర్యంలో శనివారం ఎస్సీ, ఎస్టీ మహిళల రక్షణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీబీఆర్సీ జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలపై అఘాయిత్యాలు, ద్వేషపూరిత నేరాలను నిరోధించేందుకు 1989లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని రూపొందించారన్నారు. తద్వారా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అమలులోకి వచ్చిందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు బలహీనులు కావడంతో లైంగిక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన పెంపొందించుకుని రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసెర్చ్ సెంటర్ విజయవాడ రూరల్ ఏరియా కోఆర్డినేటర్ మల్లేశ్వరి, వైఎస్సార్ కాలనీ ప్రతినిధి టీఎల్ రాజు, సచివాలయ విలేజ్ హెల్త్ సెక్రటరీ దుర్గభవానీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దివ్య, మహిళా పోలీస్ బీ దుర్గ, న్యాయవాది అఖిల తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు మాకినేని బసవపున్నయ్య



మాకినేని బసవపున్నయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిన్న తనంలోనే సంఘసంస్కరణ ఉద్యమాలకు, సాంస్కృతిక రంగంలో అభ్యుదయ భావజాలాన్ని కల్పించడంలోనూ స్వాతంత్ర్య సమరయోధుడు, మార్కిస్ట్ సిద్ధాంత కర్త మాకినేని బసవపున్నయ్య ఎనలేని కృషి చేశారని విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ పి.మధు అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం బసవపున్నయ్య 112వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రేపు స్మారకోపాన్యాసం..

అనంతరం మధు మాట్లాడుతూ.. సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల దార్శనికుడు మాకినేని బసవపున్నయ్య అన్నారు. దళితుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, అంటరానితనం నిర్మూలన కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. 2016 నుంచి విజ్ఞాన కేంద్రం ఆయన ఆశయాల బాటలో పయనిస్తూ సామాజిక, సాంస్కృతిక అంశాలపై, మహిళల స్వయం అభివృద్ధి కోసం శిక్షణలు ఇస్తూ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. మతోన్మాద శక్తులు సాంస్కృతిక రంగాన్ని కబ్జా చేసి పక్కదారి పట్టిస్తున్న నేటి తరుణంలో లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని సూచించారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ.. బసవపున్నయ్య జయంతి సందర్భంగా ఈ నెల 16వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక వైవిధ్యం–దేశ సమైక్యత అనే అంశంపై స్మారకోపాన్యాసం నిర్వహిస్తామన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ బి.వి.రాఘవులు ముఖ్యవక్తగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు టి.క్రాంతి, యు.వి.రామరాజు, ఐజాక్, పి.విజయ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి జయరాజ్ నాటక రంగ సేవలు వెలకట్టలేనివి



నివాళులర్పిస్తున్న గోళ్ల నారాయణరావు, గుమ్మడి విజయకుమార్ తదితరులు

విజయవాడకల్చరల్: రంగస్థల ప్రముఖుడు, నటుడు, దర్శకుడు గుమ్మడి జయరాజ్ నాటక రంగసేవలు వెలకట్టలేనివని కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. గుమ్మడి జయరాజ్ కళాపీఠం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో, గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జయరాజ్ 14వ సంస్మరణ సభను నిర్వహించారు. కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. తెలుగు నాటకానికి దిశానిర్దేశం చేసిన వ్యక్తి జయరాజ్ అన్నారు. జయరాజ్ కళాపీఠం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. నేటి తరానికి స్ఫూర్తిని కలిగించడానికి ప్రతీ ఏటా జయరాజ్ పేరుతో రంగస్థల పురస్కారం ప్రదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాపీఠం కార్యదర్శి గుమ్మడి అన్వేష్, నిర్వాహకుడు ఎం.ఆంటోనీ, రంగారెడ్డి, చింతా వెంకటేశ్వర్లు తదితరులు గుమ్మడి జయరాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

టి.రాజబాబుకు జయరాజ్ స్మారక పురస్కారం

గుమ్మడి జయరాజ్ 14వ సంస్మరణ సందర్భంగా నాటక రంగానికి చెందిన టి.రాజబాబుకు 2024 సంవత్సరానికి గానూ జయరాజ్ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. డాక్టర్ పీవీఎన్ కృష్ణ చేతులమీదుగా పురస్కారం అందజేశారు.

లక్ష్మణరావును గెలిపించాలని పిలుపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యారంగ ప్రయోజనాల పరిరక్షణ కోసం కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, బి.గోపీమూర్తి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, గోపీమూర్తి మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ, ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలంటే శాసనమండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఉండాల్సిన అవసరముందన్నారు.టీచర్ అప్రెంటిస్‌షిప్ రద్దు కోసం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆమరణదీక్ష చేసి సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య తదితరులు ప్రసంగించారు. సంఘ రాష్ట్ర మహాసభలు కరపత్రం, ఆదాయ పన్ను కోసం రూపొందించిన సర్క్యులర్‌ను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, సహాధ్యక్షురాలు పి.లీల, జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు కె.గంగరాజు, బీహెచ్ సూర్యనారాయణ, డి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలకు సమయం కేటాయించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని శ్రీ చైతన్య కళాశాల డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. ఏలూరు రోడ్డు చుట్టుగుంట శ్రీచైతన్య కళాశాలలో క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీన్ హరిబాబు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు దోహద పడతాయన్నారు. ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీచైతన్య కళాశాలలోని పలు బ్రాంచిలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం కార్యక్రమం



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం కార్యక్రమంలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే కార్యక్రమ ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్యక్రమం ఏర్పాట్లలో ఎటువంటి లోపం ఉండకూడదన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే అతిథులందరికీ తాగునీటి సరఫరా చేయాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు సత్యకుమారి, సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ సొసైటీలను నమ్మి మోసపోవద్దు

తెలుగు ఫిలిం చాంబర్, తెలుగు ఫిలిం డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్



మాట్లాడుతున్న తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరత్ భూషణ్, దామోదర ప్రసాద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కొందరు రకరకాల కార్మిక సంఘాలు, సొసైటీలు స్థాపించి సినీ కార్మికులను మోసం చేస్తున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు ఫిలిం – డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ హెచ్చరించింది. విజయవాడ గాంధీనగర్‌లోని ఫిలిం చాంబర్ హాలులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరత్ భూషణ్, దామోదర ప్రసాద్ మాట్లాడుతూ కొందరు సొసైటీలు, కార్మిక సంఘాలు స్థాపించి సినీ కార్మికులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నట్లు చాంబర్ దృష్టికి వచ్చిందన్నారు.అటువంటి వారిని నమ్మి మోసపోవద్దని సినీ కార్మికులను హెచ్చరించారు. ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన తెలుగు ఫిలిం చాంబర్, దానికి అనుబంధంగా తెలుగు ఫిలిం–డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, 24 అనుబంధ సంఘాలు విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు. ఇకపై ఎవరూ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి కార్మికులకు త్వరలో 'స్కిల్ డెవలప్‌మెంట్, వర్క్‌షాపులు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో ఆయా సంఘాల బాధ్యులు జె.సాంబశివరావు, అలంకార్ ప్రసాద్, అమ్మిరాజు, వి.సురేష్, వెల్లంకి శ్రీనివాస్ కుమార్, డి.సత్యనారాయణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యం.. మనోహరం

విజయవాడకల్చరల్: శ్రీ కనకదుర్గమ్మ వారి భవానీ మండల దీక్షలను పురస్కరించుకొని కలశ జ్యోతుల ఊరేగింపు బీఆర్టీఎస్ సమీపంలోని రామకోటిలో శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి భావంతో పాటు జాతీయ సమైక్యతను చాటాయి.

అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి



గుణదల(విజయవాడతూర్పు): అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని బిషప్ టి.రాజారావు పేర్కొన్నారు. ఆంధ్రా లయోలా కళాశాలలోని దేవయ్య ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తమ తలితకుమి ఉన్నతి(యువత ఎదుగుదల)కార్యక్రమం బాలికల విద్యపై దృష్టి సారించడం ద్వారా లింగ అసమానతలను తగ్గించడం, మహిళలకు సమగ్ర భవిష్యత్‌ను అందించటం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా పేద బాలికలకు పుస్తకాలు, యూనిఫాంలు, రూ.1,000ల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. అనంతరం ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత గాయకుడు రాబ్ గాలియా ఆలపించిన కొత్త క్రిస్మస్ గీతాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ జోజి తంబి, సహ్యారాజ్, డొమినికా లావణ్య, కుమార్‌రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.